بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نحمدہٗ ونصلی علیٰ رسولہ الکریم وعلیٰ عبدہ المسیح الموعود

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih vth 30.09.2016 (Telugu)**

**అల్లాహ్ తఆలాతో సంబంధము, పరస్పరం ఆప్యాయత, సోదరభావమే మన ఇజ్తిమాల నిజమైన ఉద్దేశము. అన్సారుల్లాహ్ సభ్యుడైన వ్యక్తి ఇస్లాం దృఢత్వము, అహ్మదియ్యత్‌పై హృదయపూర్వకముగా నిలుచుటకు ప్రయత్నించవలెను. అల్లాహ్ తఆలాతో సంబంధము లేనిదే ఇది ఏర్పడదు.**

**లజ్న ఇమాఇల్లాహ్ తమ ఇహలోక సర్వ కోరికలను మరచిపోయి తమ ఆచరణ స్థితిని ధార్మిక బోధనకు అనుగుణంగా మార్చుకోవలెను.**

**వినయ విధేతలకు అతడు గొప్ప ఆదర్శముగా యుండెను. అల్లాహ్ తఆలా అతని స్థాయిని పెంచుచుపోవును గాక!**

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 30.09.2016 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్, లండన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

నేటి నుండి మజ్లిస్ అన్సారుల్లాహ్ ఇంగ్లాండ్, లజ్న ఇమాఇల్లాహ్ ఇజ్తిమాలు (సమావేశములు) ప్రారంభమగుచున్నవి. అల్లాహ్ తఆలాతో సంబంధము, పరస్పరం ఆప్యాయత, సోదరభావమే మన ఇజ్తిమాల నిజమైన ఉద్దేశము. మనము ఈ విషయములతో ఎంతో కొంత నేర్చుకొని తమ జీవిత భాగములుగా చేసుకోవలననే ఉద్దేశముతో ఈ విద్యా కార్యక్రమాలు, పోటీలు జరగవలెను. కొన్ని ఆటల పోటీలు కూడ జరుగును. ఎందుకనగా అల్లాహ్ హక్కులు, ప్రజా హక్కులు చెల్లించుటకు ఆరోగ్యవంతమైన శరీరము కూడ అవసరముండును. లేనిచో అన్సారుల్లాహ్ వయసు ఆటలకు చెందినది కాదు. స్త్రీలు కూడ సాధారణంగా 22, 23 సంవత్సరముల వయసు తరువాత ఆటలలో ఆసక్తి కనబర్చరు. తమ శరీర ఆరోగ్యము వైపు కూడ శ్రద్ధ యుండాలనేదే ఈ ఆటల పోటీల ఉద్దేశము. పోటీలలో పాల్గొనేవారే కాక ఇతరులు కూడ కనీసం విహారము లేదా కొద్ది పాటి వ్యాయామంతో తమ శరీరములను చురుకుగా ఉంచుకొనుము. మన ధార్మిక, విద్యా సామర్థ్యములను మెరుగుపరచుకునే వైపు దృష్టి యుండాలనేదే ఈ ఇజ్తిమాల ఉద్దేశము.

అన్సారుల్లాహ్ వయసులో మానవుని ఆలోచన పరిపక్వత చెందును. కనుక వారికి స్వచ్ఛందంగా తమ బాధ్యతల వైపు శ్రద్ధ యుండవలెను. అన్సారుల్లాహ్ సభ్యుడైన వ్యక్తి ఇస్లాం దృఢత్వము, అహ్మదియ్యత్‌పై హృదయపూర్వకముగా నిలుచుటకు ప్రయత్నించవలెను. అల్లాహ్ తఆలాతో సంబంధము లేనిదే ఇది ఏర్పడదు. అన్సారుల్లాహ్ ప్రామాణికములు అందరికంటే గొప్పగా యుండవలెను. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో సంబంధము లేనిదే అల్లాహ్ తఆలాతో సంబంధము సంపూర్ణము కాజాలదు. ఇందుకు స్వయముగా అల్లాహ్ తఆలా ఆజ్ఞాపించెను. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పై దురూద్, సలామ్ పంపుట వైపు శ్రద్ధ వహించుము. ఇది ఎంతో అవసరమైన విషయము. ఇంకా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం బైఅత్‌లో వచ్చే హక్కు చెల్లించవలెను. ఈ యుగంలో ప్రచారమును పూర్తి చేయుటకు అల్లాహ్ తఆలా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను పంపెను. ఇస్లాం సందేశము అందించుట, ఇస్లాం ప్రచారములో శక్తిమేర పాల్గొనుచు తమను తాము అన్సారుల్లాహ్‌గా నిరూపించుకొన్నప్పుడే అహ్మదియ్యత్‌పైన మనస్ఫూర్తిగా నిలిచినట్లు అగును. కనుక ఇదొక కర్తవ్యము.

అహ్మదియ్య ఖిలాఫత్‌తో విశ్వసనీయత, దాని రక్షణ గురించి మీరొక ప్రతిజ్ఞ కూడ చేసినారు. ఈ ప్రయత్నము ఎలా జరుగును. అన్సార్ ఖిలాఫత్ కార్యములను, కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్ళుటకు దాని సహాయకులుగా అయినప్పుడు ఈ ప్రయత్నము జరుగును. ప్రస్తుత ఖలీఫా మాటలను వినుటకు శ్రద్ధ వహించినప్పుడే ఇది సాధ్యమగును.

ఇందుకు అల్లాహ్ తఆలా మనకు ఎమ్.టి.ఏ.వరమును అందించెను. కనుక అన్సారుల్లాహ్ తమను తాము దీనితో జోడించుకొను అవసరమున్నది. ఇదే విధముగా తమ సంతానమును కూడ. ఈ విశ్వసనీయత పరంపర తర తరాలుగా కొనసాగుటకు, స్థిరముగా యుండుటకు, ఇస్లాం సేవ, ఇస్లాం ప్రచార కార్యము సదా కొనసాగుటకు తమ సంతానమును కూడ ఖిలాఫత్‌తో జోడించవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం తరువాత వారి ప్రకటన ప్రకారమే ద్వితీయ దైవ నిర్ణయము అనగా ఖిలాఫత్ వ్యవస్థ ద్వారా ఇది జరుగును. ఇందుకు ప్రతి త్యాగము చేయుదుననే ప్రతిజ్ఞను గుర్తుంచుకొనుము. ఇందుకు అల్లాహ్ తఆలా అందరిని అనుగ్రహిచుగాక!

నేను చెప్పినట్లు లజ్న ఇమాఇల్లాహ్ ఇజ్తిమా కూడ జరుగుచున్నది. లజ్న ఇమాఇల్లాహ్‌కు కూడ ఒక ప్రతిజ్ఞ గలదు. దానిని వారు సదా తమ జ్ఞప్తియందుంచుకోవలెను. అల్లాహ్ తఆలా కృపానుసారము లజ్న ఇమాఇల్లాహ్‌లోని అధికులు ధర్మముపై నిలిచినవారున్నారు. మాషా అల్లాహ్. విశ్వాసపరంగా అందరు దృఢంగా యున్నారు. కాని ప్రతి అహ్మదీ స్త్రీ తన ఆచరణ స్థితులను కూడ ఈ ప్రామాణికమునకు అల్లాహ్ తఆలా అతని ప్రవక్త ఆదేశించిన స్థాయికి చేర్చుకోవలెను. మేము తమ ధర్మము కొరకు ప్రతి త్యాగము చేయుటకు సిద్ధముగా యున్నామని లజ్న ఇమాఇల్లాహ్‌కు ఒక ప్రతిజ్ఞ యున్నది. తమ ఇహలోక కోరికలను మరచిపోయి తమ ఆచరణ స్థితిని ధర్మమునకు అనుగుణంగా మార్చుకోవాలని ధర్మము మొదటి త్యాగమును ఆశించును. స్త్రీ గురించి గల ఆదేశములను కూడ ఆచరించుటకు ప్రయత్నించవలెను. స్త్రీ తమ పవిత్రత, శీలమును రక్షించుకొనుటకు అల్లాహ్ తఆలా తెలిపిన విషయములలో ముసుగుకు చాలా ప్రాధాన్యత నిచ్చెను. ఈ విషయము పట్ల ఒక అహ్మదీలో లోపము యున్నచో ఆచరణ రూపంలో అతడు తన ప్రతిజ్ఞను పూర్తి చేయడం లేదు. సమాజ భయము కాని తమ ఇహలోక కోరికలు గాని ఒక అహ్మదీని తన ధర్మ బోధన నుండి దూరము చేయకూడదు. కనుక ప్రతి అహ్మదీ తన ఆచరణ స్థితిని అల్లాహ్ తఆలా ఇచ్చిన బోధన ప్రకారము గడపవలెను.

ప్రతిజ్ఞలో సత్యముపై సదా నిలుచు మరో విషయము గలదు. మనము నిజమైన స్ఫూర్తితో దీనిపై నిలుచుచున్నామా లేదా అని తమ ప్రామాణికములను గమనించవలసిన అవసరమున్నది. సంతాన శిక్షణ ప్రతిజ్ఞ కూడ గలదు. దీనిని కూడ పూర్తి చేయుటకు సాధ్యమైనంత వరకు ప్రయత్నము చేయవలెను. ఖిలాఫత్‌తో పిల్లలను జోడించుట, ఇందుకు ప్రయత్నించుట తండ్రుల వలె తల్లుల బాధ్యత కూడ. కనుక ఈ ముఖ్యమైన బాధ్యతను ప్రతి తల్లి అర్థము చేసుకోవలెను. అల్లాహ్ తఆలా వీరిని కూడ అనుగ్రహించుగాక!

లజ్న అనగా (స్త్రీల) తో పాటు నాసిరాతుల్ అహ్మదియ్య (అమ్మాయిల) ఇజ్తిమా కూడ జరుగుచున్నది. నాసిరాత్ కూడ ప్రతిజ్ఞ చేయుదురు వారు కూడ తమ ప్రతిజ్ఞలను పూర్తి చేయవలెను. 15 సం॥ల వయసు తెలివిని ఉపయోగించే వయసే. మంచి చెడును గ్రహించే వయసే. ఈ వయసులోనే చాలా కోరికలు కలుగును. ప్రపంచము వైపు దృష్టి యున్నచో ప్రాపంచిక కోరికలు పైచేయి సాధించును. ఇందుకే ప్రతి అహ్మదీ బాలిక ఎంతో జగ్రత్తగా యుండవలసిన అవసరమున్నది. తమ ప్రతిజ్ఞను పదే పదే స్మరించుకోవలసిన అవసరమున్నది. తద్వారా ప్రాపంచిక కోరికలను అనుసరించే బదులు ప్రతి అహ్మదీ బాలిక గొప్ప గొప్ప ఉద్దేశములను పొందుటకు ప్రయత్నించును. గొప్ప ఉద్దేశములు నాసిరాతుల్ అహ్మదియ్య ప్రతిజ్ఞలో ప్రస్తావించబడినవి.

ఇజ్తిమా పేరున ఈ సంక్షిప్త వివరణ తరువాత గత కొద్ది రోజుల క్రితం మృతి చెందిన ఒక ప్రియమైన చిరంజీవి సద్గుణములను ఇప్పుడు నేను ప్రస్తావించదలచితిని. నేను ప్రస్తావించదలచిన ఆ చిరంజీవి పేరు మజ్హర్ అహ్సన్. అనారోగ్యము వలన చివరి సం॥ పరీక్షలు వ్రాయలేదు. కాని పరీక్షలో ఉత్తీర్ణుడైనా కాకున్నా ఆ చిరంజీవి ఏ విధముగా జీవితము గడిపినాడో అతడు ముబల్లిఘ్, మురబ్బీగానే యుండెను. ఎలా ధర్మ సేవ చేయాలో, అల్లాహ్ తఆలా ఇచ్చిన ఆదేశముల మేరకు ఎలా తమ ప్రవర్తనలను, తమ స్థితిని మార్చుకోవాలో అల్లాహ్ తఆలా అ నవయువకునిలో ఒక ఉద్రేకము పుట్టించెను. ప్రపంచములో వచ్చిన ప్రతి వ్యక్తి ఒక రోజు పోవలసినదే. కాని అల్లాహ్ తఆలా ఇష్టము ప్రకారము తమ జీవితమును మార్చుకొన్న వారు, ఇందులో సఫలమైనవారు అదృష్టవంతులు. ఈ ప్రియమైన చిరంజీవుని గురించి జామిఅ అహ్మదియ్య విద్యార్థులు, అతని మిత్రులు, అతని ఉపాధ్యాయులు నాకిట్లు వ్రాయుచున్నారు. ఒక వ్యక్తి మరణించినందున అతని సత్కార్యములను ప్రస్తావించవలెనని ఆచార పరమైన విషయములు కావివి. అతడు నాకు వ్యక్తిగతంగా తెలుసు. వినయ విధేయతలకు అతడు గొప్ప ఆదర్శముగా

యుండెను. అల్లాహ్ తఆలా అతని స్థాయిని పెంచుచుపోవును గాక! కీ॥శే॥ తమ తల్లిదండ్రులకు ఏకైక కుమారుడు. అతనికి ఇద్దరు సోదరీమణులు గలరు. తల్లి దండ్రులు, ప్రత్యేకంగా తల్లి సహనము, అల్లాహ్ తఆలా ఇష్టము ప్రకారము రాజీ అగుటలో గొప్ప ఉదాహరణ చూపిరి. అల్లాహ్ తఆలా వారికి గొప్ప ప్రతిఫలమివ్వుగాక! సహనము పాటించుటకు అనుగ్రహించుగాక! వారందరికి తన వద్ద నుండి సంతృప్తి, సహనము కలిగించుగాక! హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లు ఉపదేశించిరి. ఆపద గాయమునకు అల్లాహ్ తఆలాపై నమ్మకము కలిగియుండుట కంటే సంతృప్తి, సుఖము కలిగించు గొప్ప ఔషధము కంటే మరో ఔషధము లేదు. కావున అల్లాహ్ తఆలా పై సదా నమ్మకము యుండవలెను. ఈ బాలునికి క్యాన్సర్ సోకెను. చికిత్సతో అల్లాహ్ తఆలా కృపానుసారము స్వస్థత కూడ కలిగెను. కాని తరువాత యదలో ఏదో ఇన్ఫెక్షన్ జరిగినది. అది వైద్యులకు తెలియనే లేదు. దాని వలన మృతి చెందెను. اناللهوانااليەراجعون మృతుని ముని తాత హజ్రత్ మిస్త్రి నిజాముద్దీన్ గారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం (సహాబా) అనుచరులుగా యుండిరి. వారి తల్లి తరపున తాత గౌ॥ చౌధ్రి మునవ్వర్ అలీ ఖాన్ గారు, తండ్రి తరపున హాజీ మన్జూర్ అహ్మద్ గార్లు ఇద్దరు దర్వేషానె ఖాదియాన్‌గా యుండిరి.

మృతుని తల్లి ఇట్లు తెలిపిరి. నాకు సలహాలిచ్చేవాడు, నా రహస్యములు తెలిసినవాడు, ఒక ఉపాధ్యాయుని వలె నాకు శిక్షణ ఇచ్చేవాడు. నా తల్లి ఏ విషయములతో సంతోషపడును, ఏ విషయములను ద్వేషించునని కూడ అతనికి తెలిసియుండెను. అతడు తరచుగా నాతో ఖిలాఫత్ వ్యవస్థ, ప్రస్తుత ఖలీఫా. జమాఅత్, అన్నిటిని మించి హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, వారి అనుచరులు, వారి నిజమైన ప్రేమికుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం విషయములను మాట్లాడేవాడు. ఈ అంశములే అతనికి ఇష్టముండెను. ప్రాపంచిక విషయములు మధ్యలో వచ్చినా వీటిని విడిచిపెట్టుము. వీటితో మనకు సంబంధమేమిటి అని అభిప్రాయపడేవాడు. వ్యాధి కాలములో అతని స్వభావములో ఎంతో ఓర్పు, సహనము వచ్చెను. ఎప్పుడు కూడ అసహనము, కోపగించేకోవడం అతని స్వభావములో చూడలేదు. ఇతడు మొదటి సారి వ్యాధికి గురైనప్పుడు నాతో ఏదేని జమాఅత్ పని తీసుకోగలరని స్కాట్‌ల్యాండ్ అమీర్ గారితో మనవి చేసెను.

ఇదే విధముగా నాసిరాత్, లజ్న ఇజ్తిమా యుండగా అక్కడ అతను ఉత్తీర్ణత పట్టాలను డిజైన్ చేసెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పుస్తకములను క్రమం తప్పకుండా చదివేవాడు.

ఆసుపత్రిలో నమాజ్, తిలావత్‌తో పాటు ఎమ్.టి.ఏ. ద్వారా ఖుత్బాలను తప్పక వినేది. శాంతి సమావేశములు, జల్సా, జమాఅత్ ఇతర కార్యక్రమాల పేరున వైద్యులకు ఎల్లప్పుడు ప్రచారము చేసేది. జల్సా తరువాత ఇక్కడ మురబ్బీలతో జరిగే మీటింగ్ జరుగును. అతని తరగతి కూడ ఉత్తీర్ణత పొంది మీటింగ్‌లో చేరెను. మీటింగ్‌లోని విషయములను నాకు తెలిపినచో నేను కూడ వాటిని నా జీవిత భాగములుగా చేసుకొంటానని సందేశము పంపెను. ఖిలాఫత్‌తో అంతులేని ప్రేమ యుండెను.

కేమోథెరపి జరుగుచుండగా కూడ వైద్యులకు ప్రచారము చేసెను. అల్లాహ్ పై ఎంతో నమ్మకముండెను. ఏ విషయములో బాధ లేకుండెను. నన్ను అల్లాహ్ తఆలా వృధా చేయడని సదా అనేవాడు. ఇప్పుడు అల్లాహ్ తఆలా అతన్ని ఇక్కడి నుండి తీసుకెళ్లినందున ఇన్ షా అల్లాహ్ పరలోకములో అతని కోరికలను పూర్తి చేయునని ఆశిద్దామ్. డా॥ హఫీజ్ గారిట్లనిరి. మజ్హర్‌కు క్యాన్సర్ డయాగ్నోజ్ జరిగిన తరువాత భేటి అగుటకు గ్లాస్కో పోయినప్పుడు చాలా నమ్మకమున్న వ్యక్తిగా అతన్ని పొందితిని. అల్లాహ్ తఆలా ఉపకారములను సదా గుర్తుంచుకోవలెనని తరచుగా చెప్పేవాడని వారి తల్లి తెలిపిరి.

హాఫిజ్ ఫజ్లె రబ్బి గారిట్లనిరి. పవిత్ర ఖుర్ఆన్ నేర్చుకునే ఉత్సాహము చాలా యుండెను. ఎంతో మంచి, భక్తితో కూడిన ధ్వనిలో చదివేవాడు. జామిఅలో చేరక ముందే జాతీయ తాలీముల్ ఖుర్ఆన్ తరగతిలో పాల్గొనుటకు తమ కుటుంబము సమేతంగా గ్లాస్కో నుండి లండన్‌కు వచ్చేవాడు. కొన్ని ఇమిగ్రేషన్ సమస్యలు ఎదురయ్యెను. కేస్‌లో డిగ్రీ కావడంలో ఇబ్బంది తలెత్తుచుండెను. దీని వలన జామిఅలో చదువుచున్నను ప్రతి రెండవ వారం గ్లాస్కో పోవలసివచ్చుచుండెను. నీకు చాలా ఇబ్బంది కలుగుచున్నది కావచ్చునని నేను అనగా ఒక గొప్ప ఉద్దేశము కొరకు చిన్న చిన్న బాధలను భరించవలసినదేనని అనెను. జామిఅలో ఒక ఉపాధ్యాయులైన వసీమ్ ఫజల్ గారిట్లు తెలిపిరి. మజ్హర్ అహ్సన్ చాలా ధైర్యశాలి, మర్యాదస్తుడు, నిలకడతో కూడిన స్వభావము గల విద్యార్థి. తమ బాధ్యతను ఎంతో వినయ విధేయత, శ్రమతో నిర్వర్తించే విద్యార్థులలో చిరంజీవి పరిగణించబడేది. నాయకత్వ

లక్షణాలు మెరుగ్గా యుండెను.

హాఫిజ్ మష్హూద్ గారిట్లు వ్రాసిరి. కొంత కాలము క్రితము ఈ చిరంజీవితో ఫోన్‌లో మాట్లాడినాను. నేను త్వరగా ఆరోగ్యము పొంది ముబల్లిఘ్‌గా ధర్మ సేవ చేయాలని ఆశించుచున్నాని అనెను. నా చికిత్స జరుగుచుండగానే నేను నా స్థానిక జమాఅత్‌లో పని మొదలు పెట్టినానని అనెను. జమాఅత్ మురబ్బి మలిక్ అక్రమ్ గారిట్లు వ్రాసిరి. మజ్హర్ అహ్సన్ గారి కుటంబము దుబాయి నుండి గాస్కో ప్రస్థానము చేసినప్పుడు నేను స్కాట్‌ల్యాండ్‌లో జమాఅత్ మురబ్బీగా సేవలందించుచుంటిని. ఈ కుటుంబము గ్లాస్కో వచ్చిన రోజే మస్జిద్‌లో ఒక వేడుక జరుగుచుండెను. అందులో ఈ కుటుంబము కూడ పాల్గొనెను. మేము చూచినదేమనగా మజ్హర్ అహ్సన్ గారు పలకరింపుల తరువాత నేరుగా వంటగదిలోకి వెళ్లి, వంట చేసే సిబ్బందితో కలిసి ఎంతో శ్రమతో పనులన్ని చేసిరి. మొదటి రోజు నుండి వారు జామిఅ అహ్మదియ్యలో ప్రవేశించినంత వరకు ఎల్లప్పుడు మస్జిద్, జమాఅత్‌నకు సేవలందించిరి. చాలా తక్కువ మాట్లాడేవారు, సున్నితమైన మనస్కులు, శ్రమతో పని చేసేవారు. వృధా మాటలలో పడకుండా సమయమును వృధా చేయకపోయేది. సమయమును సరియైన పద్ధతిలో వినియోగించడంలో దిట్ట. తమ సమర్పణ ఆమోదించబడాలని, జామిఅ అహ్మదియ్యలో ప్రవేశము పొందాలని, ధర్మ సేవ చేయాలని హృదయపూర్వకముగా ఆశించేది. వారికి జామిఅ అహ్మదియ్యలో ప్రవేశము పొందిన రోజు జగమంతా లభించినంత ఆనందముగా యుండిరి.

వారి ఒక మిత్రుడు షర్జీల్ గారిట్లు వ్రాసిరి. ఎంతో గొప్ప సద్గుణములు గల ప్రియమైన మిత్రునిగా యుండిరి. అనేక విశిష్టతల యజమాని. ఖిలాఫత్ స్థాయిని తగిన రీతిలో అర్థము చేసుకున్నవారు. అల్లాహ్ తఆలాపై ఎంతో నమ్మకముండెను. జమాఅత్ కొరకు సర్వము త్యాగము చేసేవారు. ఒక ఉత్సాహభరితులు. ఎవరికి ఎప్పుడు బాధ, నష్టము కలిగించేవారు కాదు. ఎల్లప్పుడు హాస్యించేవారు. ఎవరైనా ఎంత ఇబ్బంది పెట్టినా కోపగించుకునేవారు కాదు, ఉద్రేకమునకు లోనయ్యేవారు కాదు. అనవసరమైన, వృధా మాటలు ఎన్నడు మాట్లాడ లేదు. నేటి వరకు దూషించుచుండగా లేదా నిందలు మోపినట్లు మేము చూడలేదు. అనుక్షణం పనిని ఎంతో ఓర్పు, ఉత్సాహము, చాలా కృషి, శ్రమ, బాధ్యాతాయుతంగా చేసేవారు. ఎప్పుడు ఏ పనిని చిన్నదిగా భావించేవారు కాదు. అలసత్వపు నామారూపల్లేకుండెను. జామిఅతో ఎంతో ప్రేమ యుండెను. సంకల్ప శక్తి చాలా దృఢంగా యుండెను. బాధ యున్నను ధైర్యము కోల్పోలేదు. తుది సమయము వరకు ఎంతో ధైర్యముతో వ్యాధిని ఎదురించిరి. ఎన్నడు ఎవరిని ఎగతాళి చేయలేదు. ప్రజలను దాని నుండి నివారించేవారు. ఒక మురబ్బీలో వుండవలసిన లక్షణములన్ని యుండెను. వారి మిత్రులైన బాలలు ఇట్లు తెలిపిరి. ముమహిదహ్ నుండే సంపూర్ణ మురబ్బీగా యుండిరి. దైవభక్తిలోని సూక్ష్మమైన మార్గములను అనుసరించేవారు. ఎలాంటి కల్పితము లేకుండెను. బాహ్యాంతరములు ఏకంగా యుండెను. మాటలు, ఆచరణలో వ్యత్యాసము లేకుండెను. పవిత్ర ఖుర్‌ఆన్ ఆదేశములను పాటించేవారు.

ఎంతో విశ్వసనీయుడు, తమ జీవిత ఉద్దేశమును గ్రహించే అహ్మదీ బాలునిగా యుండెను. అల్లాహ్ తఆలా కరుణలు సదా అతనిపై పడును గాక! అతని స్థాయిని పెంచుగాక! సదా అల్లాహ్ తఆలా అభీష్టముపై రాజీ పడేవానిగా మేము అతన్ని చూచితిమి. అల్లాహ్ తఆలా తన ప్రియుల పాదములలో అతనికి స్థానము కల్పించుగాక! తమ ఉద్దేశమును ఇంత సున్నితముగా అర్థము చేసుకునే వేలాది సమర్పితులను అందించుగాక! వీరి తల్లిదండ్రులకు, సోదరీమణులకు సహనము, ఒర్పులో పెచుచు పోవును గాక! (ఆమీన్) ☆ ☆ ☆

BOOK POST (PRINTED MATTER)

To,

.........................................................................

.........................................................................

.........................................................................